క్లుప్తంగా

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



భవానీపురం(విజయవాడ పశ్చిమ): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం కనీస బాధ్యతగా గుర్తించాలని ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ బి.మనోరంజని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు శనివారం 'తల్లి పేరుతో ఒక మొక్కను నాటండి'లో భాగంగా విజయవాడ బాలసదనం, ఉద్యోగినుల వసతి గృహంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, విజయవాడ అర్బన్, రూరల్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, బాల సదనం సిబ్బంది, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుగంధరాచార్యకు గురువందన్ పురస్కార్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత వికాస్ పరిషత్ (తూర్పు) సంస్థ కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు గురువందన్ పురస్కార్ -2024ను అందిస్తున్నట్లు ఆ సంస్థ గురుపూజోత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్ జగన్‌మోహనరావు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరిగే ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల ఒకటో తేదీ భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలో ఉన్న గేట్స్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ ఆడిటోరియంలో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి కూరపాటి నారాయణరావు అధ్యాపక బృందం డాక్టర్ యుగంధరాచార్యకు అభినందనలు తెలిపారు.

పునరావాస కేంద్రాలకు తరలించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని బుడమేరు పరిసర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించాలని వీఎంసీ కమిషనర్ సీహెచ్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన బుడమేరు కాలువను పరిశీలించారు. సాధారణ నీటిమట్టం కంటే 15000 క్యూసెక్కుల నీటి మట్టం పెరగడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో వెంటనే అక్కడ నుంచి పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా ప్రజాశక్తి నగర్ కమ్యూనిటీ హాల్, లగడపాటి రాజగోపాల్ కల్యాణ మండపం, ఎస్సీ నగర్ కమ్యూనిటీ హాల్, కండ్రికలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు తక్షణమే తరలించాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లోని ప్రజలు త్వరితగతిన ఆయా ప్రదేశాలను ఖాళీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

జారిపడిన మట్టి పెళ్లలు



విద్యాధరపేట(విజయవాడ పశ్చిమ): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్థానిక 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు కొండప్రాంతంలోని కొండ్రు వారి వీధిలో శనివారం సాయంత్రం రిటైనింగ్ వాల్ కుంగి మట్టి పెళ్లలు కింద ఉన్న నివాసాలపై జారిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొండప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

దోషులను కఠినంగా శిక్షించాలి

షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో చోటు చేసుకున్న ఘటనలో దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఈ సంఘటనలు వివరిస్తున్నాయని తెలిపారు. విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని కాలరాసే విధంగా వ్యవహరిస్తున్న వారిని శిక్షించాల్సిందేనని పేర్కొన్నారు. ప్రధానంగా పోలీసు శాఖ ఇంజినీరింగ్ కళాశాలలో అంతా బాగానే ఉందని తొలుత ప్రకటించారని, ఆ తర్వాత తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రజలను అయోమయానికి గురిచేయడంతో పాటుగా ప్రభుత్వ అసమర్థతను తెలియజేస్తోందని పేర్కొన్నారు. పాలకపక్షానికి చెందిన నేతలు సైతం విమర్శలు చేస్తున్నారేగానీ సంఘటనను ఖండించడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎడతెరపి లేని వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం



పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



పాతబస్తీలో రోడ్లపై నిలిచిన వర్షం నీరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం శనివారం నాటికి తీవ్ర రూపం దాల్చింది. అల్పపీడన ప్రభావంతో పాతబస్తీలోని లోతటు ప్రాంతాలన్ని పూర్తిగా నీటమునిగాయి, వర్షం భారీగా కురవడం కొద్దిసేపు తెరపించటం మళ్లీ కురవటంతో వాన నీరు ప్రధాన డ్రైన్ల ద్వారా బయటకు వెళ్లిపోయింది. మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో స్థానిక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. భారీ వర్షం కారణంగా వర్షం నీరు వీధుల్లో నిలిచిపోవడంతో ప్రజలు తమతమ కార్యకలాపాలకు వెళ్లేందుకు ఇక్కట్లు పడ్డారు. భారీగా కురిసిన వర్షంతో నీరు బయటకు వెళ్లేందుకు సమయం తీసుకోవడంతో అక్కడక్కడా లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. ప్రధానంగా పాతబస్తీలోని గణపతిరావురోడ్డు, సుబ్బరామయ్యవీధి, గులాంమొహిద్దీన్‌వీధి, కేటీ రోడ్డు, కుమ్మరివీధులు, డ్రైన్‌వీధి, మహంతీపురం, వించిపేటలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండటంతో ఆయా ప్రాంత నివాసితులు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. దానికి తోడు నూతనంగా ఆయా ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరగటంతో పాత వీధుల్లో డ్రైన్లు నిండి రోడ్లపైకి నీరు చేరుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ వించిపేటలోని గాంధీబొమ్మ సెంటర్, మహంతీపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక నివాసితులను అప్రమత్తం చేశారు.

నీట మునిగిన వాహనాలు

పాతబస్తీలోని పలు వీధుల్లో భారీగా వర్షం నీరు చేరడంతో ఇళ్ల వద్ద ఉంచిన వాహనాలు పూర్తిగా నీటమునిగాయి. ప్రధానంగా సుబ్బరామయ్యవీధి, డ్రైన్‌వీధి, గీతామందిరం వీధి, రంగన్నవీధి, వట్టూరి వారి వీధి తదితర ప్రాంతాల్లో వర్షం నీరు తరలివచ్చింది. దాంతో ఆయా వీధుల్లో ఉన్న దుకాణాల్లో సైతం నీరు చేరింది. పలు మెడికల్ హోల్‌సేల్ దుకాణాల్లోకి నీరు రావడంతో సరకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ద్విచక్ర వాహనాలతో పాటుగా కార్లు సైతం పూర్తిగా మునిగిపోయాయి.

వర్షం నీరు భారీగా రావటంతో స్థానికంగా ఉన్న కార్పొరేటర్లు జెండాచెట్టు వద్దకు చేరుకొని డైవర్షన్ చానల్ ద్వారా కెనాల్‌లోకి వర్షం నీరు వెళ్లే విధంగా చూశారు. నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది అక్కడకు చేరుకొని త్వరగా వర్షంనీరు బయటకు పోవడానికి చర్యలు చేపట్టారు.

ఇబ్బందులెదుర్కొన్న చిరు వ్యాపారులు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలోని చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. ప్రధానంగా గురు, శుక్రవారాలు వర్షంతో చిరు వ్యాపారుల ఆదాయానికి తీవ్ర గండి పడింది. శనివారం సైతం అదే పరిస్థితి ఉండటంతో వారి పరిస్థితి దారుణంగా మారింది. అలాగే హాకర్లు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఒకవైపు చిరు వ్యాపారులతో పాటుగా నియోజకవర్గంలో వేలాదిగా ఉన్న ముఠా కార్మికులు సైతం పనులు లేక ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలోని మొయిన్‌బజార్, వస్త్రలత, కృష్ణవేణి మార్కెట్, పాతబస్తీలోని వివిధ పాతమార్కెట్లు వినియోగదారులు లేక బోసిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ దుకాణాలన్ని ఖాళీగా దర్శనమిచ్చాయి. వ్యాపారస్తులతో పాటుగా అన్ని రకాల వ్యాపార వర్గాలు శుక్ర, శనివారాలు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు.

విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం శనివారం సెలవు ప్రకటించింది. ఆదివారం సాధారణ సెలవు కావటంతో పాఠశాలలు పూర్తిగా మూతపడ్డాయి. శనివారం ఉదయం సెలవు ప్రకటించటంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు చాలా మంది చేరుకున్నారు. అయితే పాఠశాలలు సెలవు అని తెలియటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతూ తమ ఇళ్లకు చేరుకున్నారు. వర్షం పరిస్థితులు తెలిసి ఉన్నప్పుడు ముందుకు హాలిడే ప్రకటిస్తే బాగుండేదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా వర్షం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో కొన్ని ప్రైవేట్ సంస్థలు సైతం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. వ్యాపార దుకాణాలు పూర్తిగా మూతపడ్డాయి.

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): భారీ వర్షాలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు జలమయంగా మారాయి. బస్‌స్టాండ్ ఇన్‌గేట్ వద్ద భారీగా వర్షం నీరు నిలవటంతో బస్టాండ్‌లోకి వచ్చే అనేక బస్సులు సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. హైదరబాద్ బస్ రూట్లలో సర్వీసులు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. పలు బస్సులను దారిమళ్లించి నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. విజయవాడ డిపో, గవర్నర్‌పేట-1, 2 డిపోల్లో నీరు భారీగా నిలిచింది.

పూర్ణానందంపేటలో..

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): భారీ వర్షల కారణంగా పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, పాత ఆర్‌ఆర్‌పేట తదితర ప్రాంతాల్లో మోకాలి లోతు ఎత్తులో వాన నీరు చేరటంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో ఏ వీధి చూసినా చిన్న పాటి చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు సైతం నీటిలో మునిగిపోయి కనిపించాయి. దీంతో వాహనచోదకులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు.

వర్ష బీభత్సం



కొత్తపేట పీఎస్ లోపల వాన నీరు



సొరంగం వద్ద విరిగిపడిన చెట్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చిట్టినగర్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో బీభత్స వాతావరణం నెలకొంది. చిట్టినగర్, సొరంగం, బ్రహ్మంగారి మఠం, కటికల మస్తాన్ వీధి, ఎస్ఏఎస్ కాలేజీ వద్ద చెట్లు, రిటైనింగ్ వాల్స్ విరిగి పడ్డాయి. చిట్టినగర్ కటకల మస్తాన్ వీధిలో కొండపై నుంచి భారీ చెట్టు విరిగి కింద ఉన్న రేకులషెడ్డుపై పడింది. సొరంగం కొండపై నుంచి రాళ్లు జారిపడటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. చిట్టినగర్ వైపు నుంచి సితారాకు బస్సులు, ఆటోలను పూర్తిగా నిలిపివేయగా, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. 48వ డివిజన్ కొండ ప్రాంతంలోని వలీ వీధిలో రిటైనింగ్ వాల్ జారిపడటంతో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి కొండ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలంటూ కొత్తపేట సీఐ కొండలరావు సూచించారు.

కూలిన చెట్టు.. దెబ్బతిన్న ఆటో, కారు

పాలప్రాజెక్టు సమీపంలోని ఎస్ఏఎస్ కళాశాల వెనుక భాగంలో రిటైనింగ్ వాల్ జారిపడింది. దీంతో పక్కనే ఉన్న భారీ వృక్షం విరిగి పడటంతో అక్కడే నిలిపి ఉంచిన ఆటో, కారు దెబ్బతిన్నాయి. మరో వైపున కరెంట్ వైర్లు తెగి పడటంతో విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేశారు.

కొత్తపేట పీఎస్‌లోకి వర్షం నీరు

కేటీ రోడ్డు పూర్తిగా నీట మునగడంతో కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోఉన్న పోలీస్‌స్టేషన్ లోకి వర్షం నీరు చేరింది. స్టేషన్ ఆవరణతో పాటు ఎస్ఐలు, సీఐ రూమ్‌లతో పాటు రైటర్ రూమ్, స్టేషన్ రికార్డు రూమ్‌లోకి నీరు చేరింది.

గట్టువెనక ఏ రోడ్డు చూసినా జలమయమే..



లేబర్‌కాలనీలోని 6 బిల్డింగ్‌ల ఇళ్లల్లోకి వచ్చిన నీళ్లు



జలమయమైన కుమ్మరిపాలెం సెంటర్ రోడ్డు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రెండు రోజులుగా కురుస్తున్న వానల కారణంగా గట్టువెనక ఏ రోడ్డు చూసినా జలమయమై కనిపిస్తోంది. కొన్నిచోట్ల మోకాలి లోతు ఎత్తులో నీళ్లు నిలిచిపోయి కనిపిస్తున్నాయి. పలుకాలనీల్లో మంచాలపై సామాన్లు పెట్టుకుని భయంగా గడుపుతున్నారు. వాటిలో భవానీపురంలోని ప్రియదర్శిని కాలనీ, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, లలితానగర్, టెలిఫోన్ కాలనీ, రోటరీ నగర్, జోజినగర్ తదితర కాలనీలు ఉన్నాయి. లేబర్‌కాలనీలో ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో (శిథిలావస్థలో) ఉన్న 6 బిల్డింగ్‌ల్లో నివసిస్తున్న సుమారు 40 కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. రోటరీ నగర్‌లో ఇళ్లలోకి నీరు చేరింది. విద్యాధరపురం ఆర్టీసీ డిపో పూర్తిగా మునిగిపోయింది.

కొండ రాళ్లు విరిగిపడి దెబ్బతిన్న మూడు ఇళ్లు

విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్ కొండపై కొండ రాళ్లు విరిగిపడి కింద ఉన్న అబ్దుల్ గఫార్ ఇంట్లో ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషిన్ ధ్వంసమయ్యాయి. ముచ్చుపోతుల దుర్గ, కొయ్య వెంకట లక్ష్మి కుటుంబాలు రెండు పోర్షన్ల రేకుల షెడ్‌లో నివసిస్తుండగా వారి ఇంటిపై లంకలపల్లి శాంతి ఇంటి పునాది జారిపడి వారి ఇళ్లల్లోని సామాను ధ్వంసమైంది. ముచ్చుపోతుల కన్నమ్మ, శ్రీనివాసరావు దంపతులు ఉంటున్న రేకుల షెడ్‌పై కొండ రాళ్లు జారిపడి ఫ్రిజ్, ఫ్లోరింగ్ పాడైపోయయాయి. స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, ఆమె తనయుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు హయాత్ షరీఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, వీఆర్‌ఓ విజయలక్ష్మి, వీఎంసీ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారిని బంధువుల ఇళ్లకు పంపించారు. మరి కొంతమందిని స్థానిక లేబర్‌కాలనీలో వీఎంసీ పునరావాస కేంద్రానికి తరలించారు.

యోగాతో మనసుకు సంపూర్ణ శాంతి



మాట్లాడుతున్న యోగేష్ అగర్వాల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మనస్సుకు సంపూర్ణమైన శాంతిని అందించేది యోగా మాత్రమేనని అంతర్జాతీయ యోగా గురువు యోగేష్ అగర్వాల్ అన్నారు. యోగ సాధన ద్వారా ప్రపంచ శాంతిని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఏపీ శాఖ ఆధ్వర్యంలో సహజయోగ ధ్యానంపై రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ శనివారం నగరంలోని సీవీ రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా యోగేష్ అగర్వాల్ మాట్లాడుతూ జీవితంలో సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే సహజయోగాన్ని ఆచరించాలన్నారు. నాయకత్వంలో ఉన్న వారు ఆధ్యాత్మికంగా మరింత ఉన్నతి సాధించాలన్నారు. కొత్తగా వచ్చే వారిని ప్రోత్సహించాలన్నారు. దుర్గగుడి ఈవో రామారావు మాట్లాడుతూ సామూహిక ధ్యానంతో ఆధ్యాత్మిక ఉన్నతిని పొందొచ్చన్నారు. మంచి నడవడిక, జ్ఞాపకశక్తి, మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర సమన్వయ కర్త కల్లూరు రామకృష్ణ అధ్యక్షత వహించారు. నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా) ట్రైనర్ బ్రజేష్ చంద్ర పాండే, దక్షిణ భారత కోఆర్డినేటర్ కె.సుభాషిణి, సహజయోగ ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యులు పీవీ రామ్మోహనరావు, మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, విజయవాడ సిటీ కోఆర్డినేటర్ టి.రవీంద్రబాబు పర్యవేక్షించారు.

కొత్తపేటలో కూలిన ఇల్లు

జారిపడ్డ మరో ఇంటి గోడ, మెట్లు



పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇంతియాజ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పాతబస్తీలోని కొత్తపేట కొండ ప్రాంతంలో ఇల్లు కూలడంతో పాటు మరో ఇంటి గోడ, దానికి అనుకొని ఉన్న మెట్లు కూలాయి. 51వ డివిజన్ శ్రీ తేలప్రోలు రాజామైస్కూల్ వెనుక భాగంలో ఉన్న పితాని అప్పలస్వామి వీధి లేబర్ కాంగ్రెస్ కార్యాలయం కొండపై భాగంలో ఘటన జరిగింది. ఇల్లు పురాతనమైనది కావడంతో ఇరుసు రమణ, నీలమ్మ నివాసం పూర్తిగా ధ్వంసమైంది. ఆ ఇంటికి సపోర్టుగా ఉన్న గోడ పడిపోయింది. దానికి అనుకొని ఉన్న మెట్లు కూలాయి. స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పైనుంచి వచ్చే మురుగునీరు స్థానికుల నివాసాల్లోకి రావడంతో ఆ ప్రాంతంలో చిన్నారులు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్, నగరపాలకసంస్థ సిబ్బంది శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్థానికులు అప్రమత్తం కావడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. నిరాశ్రాయులైన తొమ్మిది కుటుంబకు లేబర్‌కాలనీలో తాత్కాలిక వసతిని ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్.. తహసీల్దార్ ఇంతియాజ్‌కు సమాచారం అందించడంతో ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రోడ్లపై వర్షం నీరు లేకుండా చర్యలు తీసుకోవాలి
- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వర్షప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ) సిసోడియా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన తో కలిసి సున్నపుబట్టీల సెంటర్‌లో కొండ చరియలు విరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. అనంతరం ఆయన మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద పరిశీలించారు. రెండు రోజులుగా పడుతున్న వర్షంతో రోడ్లపై నిలిచిన నీళ్లను ఎయిర్‌టెక్ మిషన్స్‌తో వెంటనే తొలగించాలని, డ్రెయిన్లలో పూడిక తీయాలని ఆదేశించారు. అనంతరం ఆయన కండ్రిక రాజీవ్ నగర్, నూజివీడు రోడ్‌లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీఎంసీ అధికారులు ఇరిగేషన్ శాఖ సమన్వయంతో బందర్, రైవస్, ఏలూరు కాలువలో వర్షపు నీటి తరలింపునకు ప్రణాళిక అమలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ సిబ్బందితోపాటు ఇతర విభాగాలు అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపై వాన నీరు



విజయవాడ స్టేషన్‌లో ఇలా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపై వర్షం నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికే ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా విజయవాడ డివిజన్‌లో అధికారులు పలు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంల వద్ద ట్రాక్‌లపై వర్షం నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమై నీటిని తరలించే చర్యలు చేపట్టారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో పలు చోట్ల పైకప్పులపై లీకేజీలు ఏర్పడటంతో కురుస్తున్న వర్షాలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేత

సమాచారం కేంద్రం వద్ద విరిగిపడిన కొండచరియలు



ఇంద్రకీలాద్రిపై విరిగిపడిన కొండచరియలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డుపై పలుచోట్ల కొండ చరియలు విరిగి పడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండ రాళ్లు జారిపడుతుండటంతో ఘాట్‌రోడ్డుపై రాకపోకలను దేవస్థానం నిలిపివేసింది. శనివారం మధ్యాహ్నం ఘాట్‌రోడ్డులోని సమాచార కేంద్రం, డోనర్ సెల్ మధ్య పెద్ద శబ్దంతో భారీ కొండ చరియలు విరిగి పడ్డాయి. వారం క్రితం సమాచార కేంద్రాన్ని రీమోడల్ చేయడానికి పనులు ప్రారంభించారు. సమాచార కేంద్రం పునర్నిర్మాణం కోసం తీసుకువచ్చిన సామగ్రి ధ్వంసమైంది. కొండచరియలు విరిగి పడే సమయంలో డోనర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏదో శబ్దం వస్తోందని లోపల నుంచి బయటకు వచ్చారు. ఇంతలో కొండ పైనుంచి పెద్ద రాళ్లు ఒక్కసారిగా కింద పడటంతో వారు ప్రాణ భయంతో పరుగులు తీశారు. డోనర్ సెల్‌కు ఓ పక్క ఉన్న అద్దాలతో పాటు షెడ్డులోని కొంత భాగం దెబ్బతింది.

తప్పిన ప్రాణాపాయం!

కొండ రాళ్లు విరిగి పడిన ప్రాంతంలో రోజూ ముగ్గురు, నలుగురు ఆలయ సిబ్బంది కూర్చుని ఉంటారు. సమాచార కేంద్రాన్ని రీమోడల్ చేసేందుకు పనులు ప్రారంభించారు. ఒకవేళ పనులు జరగకపోతే సమాచార కేంద్రంలో సూపరింటెండెంట్ స్థాయి అధికారితో పాటు ఏపీఆర్వో, మరో నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఉండేవారు. అదే సమాచార కేంద్రం పాత స్థానంలో ఉంటే భారీగానే ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు.

అలాగే ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం సమీపంలో మౌనస్వామి వారి విగ్రహం పైభాగంలో కొండ రాళ్లు జారిపడగా, అక్కడ ఏర్పాటు చేసిన ఐరన్‌మెష్‌తో రాళ్లు కింద పడకుండా నిలువరించాయి. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్, చైనా వాల్ ప్రాంతంలో మరికొన్ని కొండ రాళ్లు జారిపడ్డాయి.

భక్తులకు ఇబ్బంది కలగకుండా

జోరుగా వానలు కురుస్తుండటంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డును శనివారం తెల్లవారుజాము నుంచి మూసివేశారు. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగా ఘాట్‌రోడ్డును మూసివేసినట్లు ఆలయ ఈవో కెఎస్.రామరావు పేర్కొన్నారు. వర్షాలకు అధికారుల ఆంక్షలు విధించడంతో మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా భక్తులను పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు.

సృజనాత్మకతతో విజయాలు



బహుమతులు అందిస్తున్న అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సృజనాత్మకతతో విజయాలు సొంతమవుతున్నాయని ఏపీ సాంకేతిక విద్యాశాఖ డెప్యూటీ డైరెక్టర్ బచ్చు నాగేశ్వరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'హాక్‌థాన్ – 1.0' పేరుతో రెండు రోజుల పాటు హ్యాకింగ్‌పై జాతీయ స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు జరిగిన పోటీల విజేతలకు శనివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కళాశాల అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు మాట్లాడుతూ కంప్యూటర్లు, దాని అనుబంధ రంగాల విద్యార్థులకు తమ కళాశాల ఆధ్వర్యాన ఏటా ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనను వెలికి తీయడానికి పోటీలు దోహదపడతాయన్నారు. ఖరగ్‌పూర్ ఎన్ఐటీ, అన్నా విశ్వవిద్యాలయం చెన్నై వంటి ప్రముఖ విద్యాసంస్థలతో పాటు దేశంలోని, రాష్ట్రంలోని ప్రముఖ సంస్థల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ అక్బర్, కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి రాఘవయ్య పాల్గొన్నారు.

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి నష్టనివారణకు కృషి చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా వర్షం నీటితో పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు నీట మునిగాయని తెలిపారు. వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు రహదారుల పైకి రావద్దని కోరారు